సాక్షి
నిజామాబాద్
సోమవారం, 16, సెప్టెంబర్, 2024



బేస్‌బాల్ చాంపియన్‌గా..
నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ బాలికల జట్టు విజేతగా నిలిచింది.
-8లో ▸



వలసదారుల ఆశలు తీరేలా..
గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్న మంత్రి పొన్నం ప్రకటనతో వలస కార్మికుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.8 /21.2
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 27 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా వరద కాలువ ద్వారా నిరంతరం 19 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలు ద్వారా 400 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో అంతే స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

వైద్య సిబ్బందికి మెమోలు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి పీహెచ్‌సీలో ఆయుష్ వైద్యురాలు అలేఖ్య, సిబ్బంది చందనకు డీఎంహెచ్‌వో రాజశ్రీ మెమోలు జారీ చేశారు. ఇటీవల పీహెచ్‌సీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేసిన సమయంలో వారు విధులకు గైర్హాజరు కావడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నోటీసులిచ్చారు. అలాగే ఇన్‌చార్జి డ్రాయింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనకు బాధ్యతలు అప్పగించారు.

రైతు ధర్నా 19వ తేదీకి వాయిదా

ఆర్మూర్: పసుపు బోర్డు సాధన కోసం ఉద్యమించిన ముత్యాల మనోహర్‌రెడ్డి మృతికి నివాళి అర్పిస్తూ సోమవారం నిర్వహించాల్సిన ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ప్రభాకర్, యాదాగౌడ్, ఇట్టెడి లింగారెడ్డి ఆదివారం తెలిపారు. పసుపు బోర్డు సాధించుకొనే వరకు కాళ్లకు చెప్పులు లేకుండా నిరసన తెలపడంతో పాటు ఎర్రజొన్న రైతులకు బకాయిలు ఇప్పించడం కోసం జరిగిన రైతుల ఉద్యమాల్లో మనోహర్‌రెడ్డి క్రియాశీలంగా పాల్గొన్నారన్నారు. తహసీల్ కార్యాలయాల ఎదుట రైతు ధర్నాను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఉమ్మెడ వద్ద భారీ ప్రతిమల నిమజ్జనం

ఖలీల్‌వాడి: నగరంలో ప్రతిష్ఠించిన విగ్రహాల్లో ఎనిమిది అడుగుల కంటే ఎత్తయిన వాటిని నందిపేట్ మండలం ఉమ్మెడ గోదావరి వద్ద నిమజ్జనం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ సూచించారు. జాన్కంపేట్, నవీపేట్ వద్ద రైల్వే ఎలక్ట్రిక్ లైన్ ఉండటంతో భారీ విగ్రహాలు బాసరకు వెళ్లే అవకాశం లేదన్నారు. దీంతో బాసరకు కొద్ది దూరంలో ఉన్న ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎనిమిది ఫీట్లకన్న ఎక్కువ ఎత్తు గల విగ్రహాలను కంఠేశ్వర్ బై పాస్ చౌరస్తా, మానిక్ బండార్, మాక్లూర్, ఆంధ్రనగర్, నందిగుట్ట మీదుగా ఉమ్మెడ సమీపంలో గల గోదావరి వంతెన వద్దకు తరలించాలని సూచించారు.

ఉద్యోగులారా.. రనౌట్ కాకండి

- అవినీతికి వ్యతిరేకంగా ఎన్పీడీసీఎల్ ప్రచారం
- ఆకర్షిస్తున్న వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: 'ప్రియమైన ఉద్యోగులారా.. సుదీర్ఘమైన సర్వీస్ మధ్యలో రనౌట్ అవకండి' అంటూ ఎన్పీడీసీఎల్ సంస్థ అవినీతికి వ్యతిరేకంగా ముద్రించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ విద్యుత్ ఉద్యోగులు లంచం అడిగితే ఇవ్వవద్దని, ఎవరైనా లంచం అడిగితే 92810 33233/1064 మొబైల్, టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది. ఈ అంశంతో ముద్రించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు పట్టణంలోని పలు ప్రాంతాలలో దర్శనమిస్తున్నాయి. దీనిని అధికారులు వారి వాట్సాప్ స్టేటస్‌గానూ పెట్టుకుంటున్నారు.

కాంగ్రెస్‌లో జోష్

- పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్
- జిల్లా నుంచి తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు
- కరాటే మాస్టర్ నుంచి పీసీసీ చీఫ్ వరకు ఎదిగిన వైనం



పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ సందర్భంగా పూజలు చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెలకొంది. ఆదివారం బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున్న పార్టీ శ్రేణులు తరలి వెళ్లాయి. కరాటే బ్లాక్ బెల్ట్ హోల్డర్ అయిన మహేశ్‌కుమార్ గౌడ్ తన కెరీర్ ప్రారంభంలో కరాటే మాస్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో మహేశ్‌గౌడ్ కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ ద్వారా తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ పార్టీ కార్యకలాపాల నిర్వహణలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. పార్టీకి విధేయుడిగా వ్యవహరించారు. దీంతో పార్టీ అధిష్ఠానం మహేశ్‌గౌడ్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. పీసీసీ పీఠం ద్వారా ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన నేపథ్యంలో ఈ బాధ్యతలు అప్పగించడం విశేషం. గత శాసనసభ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు సైతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్‌గౌడ్ సీనియర్, జూనియర్ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. పార్టీ కార్యకలాపాల నిర్వహణ విషయంలో మహేశ్‌గౌడ్ అన్నీ తానై వ్యవహరించడంతో రేవంత్‌రెడ్డిపై భారం తగ్గింది. దీంతో రేవంత్ ప్రచారపర్వంలో స్వేచ్ఛగా ముందుకు వెళ్లగలిగారు. ఈ నేపథ్యంలోనే పీసీసీ అధ్యక్ష పదవి కోసం పలువురు పోటీ పడినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహేశ్‌గౌడ్ వైపే మొగ్గు చూపారు. ఇక గత శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన మహేశ్‌గౌడ్‌కు పార్టీ అగ్రనాయకత్వం ఎమ్మెల్సీ పదవి కేటాయించింది. తర్వాత కొన్ని రోజులకే పీసీసీ పీఠం సైతం అప్పగించడం విశేషం.

నాడు డీఎస్.. నేడు మహేశ్‌గౌడ్

ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ధర్మపురి శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడిగా వరుసగా రెండుసార్లు వ్యవహరించారు. మళ్లీ ఇప్పుడు తెలంగాణ ఏర్పాటయ్యాక పార్టీ అధికారంలో ఉండగా నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌గౌడ్‌కే పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం విశేషం.

భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

జిల్లాలోని భీమ్‌గల్ మండలం రహత్‌నగర్‌కు చెందిన మహేశ్‌గౌడ్ హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కాగా గాంధీభవన్‌తో పాటు రాష్ట్ర రాజధాని నగరంలోని అనేక చోట్ల జిల్లా నాయకులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లాకు వచ్చినప్పుడు సైతం భారీగా స్వాగతం పలికేందుకు జిల్లా నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. పార్టీ కార్యకలాపాల నిర్వహణలో దిట్టగా పేరుపొందిన మహేశ్‌గౌడ్‌కు సౌమ్యుడిగా పేరుంది. ఇప్పటివరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తూ చిన్న, పెద్ద, పాత, కొత్త నాయకులను కలుపుకుని ముందుకు తీసుకెళ్లడంలో మంచి పేరున్న మహేశ్‌గౌడ్ కీలక బాధ్యతలు తీసుకోవడంపై జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

శుభాకాంక్షలు తెలిపిన పోచారం



పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆదివారం గాంధీభవన్‌లో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: జిల్లాలో నిమజ్జన ఉత్సవాల ప్రశాంతంగా జరుపుకోవాలని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనానికి రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్రపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. డీజేలకు అనుమతి లేదన్నారు. గతంలో అల్లర్లకు పాల్పడిన రౌడీషీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు వెల్లడించారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి



నిజామాబాద్ అర్బన్: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెండోసారి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కిషన్ ఎన్నికయ్యారు. అసోసియేట్ కార్యదర్శిగా అంకం నరేశ్ ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు వీరు పదవిలో ఉంటారు. ఈ ఎన్నికకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మణ్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో నగరంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 1 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బా చౌరస్తా నుంచి రైల్వేగేట్, గంజ్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, బోధన్ బస్టాండ్, రెండో పోలీస్ స్టేషన్ బ్యాక్‌సైడ్ బర్కత్‌పూర, గురుద్వారా నుంచి లక్ష్మీ మెడికల్, బడాబజార్ చౌరస్తా, గోల్ హనుమాన్ చౌరస్తా, పూలాంగ్ మీదుగా వినాయకుల బావి వరకు రథయాత్ర కొనసాగుతుందని వివరించారు. ఆయా మార్గాల్లో ఇతర వాహనాలకు అనుమతి లేదన్నారు. అలాగే కింద తెలిపిన మరికొన్ని మార్గాల్లో కూడా దారి మళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు.

- హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వచ్చే బస్సులు బైపాస్, కంఠేశ్వర్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు రావాలి.
- బోధన్ వెళ్లే బస్సులు రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలి.
- బాన్సువాడ వెళ్లే వాహనాలు రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు సర్కిల్, పూలాంగ్ చౌరస్తా, ఆర్ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా మీదుగా బాన్సువాడ పోవాలి.
- హైదరాబాద్ వైపు నుంచి బోధన్ వెళ్లే భారీ వాహనాలు మాధవనగర్ బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా వెళ్లాలి.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- మున్సిపల్ కమిషనర్ మకరందు



గెలుపొందిన క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్ మకరందు, నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: సైక్లింగ్ క్రీడతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ మకరందు అన్నారు. ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కమిషనర్ హాజరై మాట్లాడారు. తాను కూడా సైక్లింగ్ చేస్తానన్నారు. నగరంలో సౌత్ జోన్ స్థాయి క్రీడలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఇలాంటివి మరిన్ని నిర్వహించాలన్నారు. ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా సైకిల్ సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర సైక్లింగ్ సంఘం కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, టి సూర్యప్రకాశ్, నర్సింగ్‌రావు, వెంకట నర్సయ్య, పాషా, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సుస్తీ!

- సీజనల్ వ్యాధులతో ఇంటిబాట పట్టిన పలువురు
- పట్టించుకోని వార్డెన్లు
- కలెక్టర్ ఆదేశాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన యంత్రాంగం



వినాయక్‌నగర్ ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హనుమంతు (ఫైల్)

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో ఉన్న విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. కొద్దిరోజులుగా అనేక పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడుతూ ఇంటి బాట పడుతున్నారు. దీంతో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందించి అన్ని హాస్టళ్లను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోని శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల, సంక్షేమ వసతి గృహాలను జిల్లా అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పరిసరాలు అధ్వానంగా ఉండటంతోనే విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నట్లు తేలింది. ఇటీవల కురిసిన వర్షాలతో పరిసరాల అపరిశుభ్రత, సీజనల్ వ్యాధుల విజృంభనతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు.

మందులు కరువు

హాస్టళ్లలో వంట గదులు సక్రమంగా లేకపోవడం, అపరిశుభ్రత వాతావరణం నెలకొనడంతో దోమలు పెరిగి, వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా హాస్టళ్లలో 20 నుంచి 30 మంది విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిసింది. జిల్లాలోని శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఓ గురుకుల పాఠశాలలో 520 మంది విద్యార్థులు ఉండగా ఏకంగా 86 మంది గైర్హాజరయ్యారు. వారందరూ జ్వరంతో ఇంటికి వెళ్లారు. ఆయా హాస్టళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ముందుగానే సూచించినా కొందరు వార్డెన్లు నామమాత్రపు చర్యలు తీసుకున్నారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు తోడు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. హాస్టళ్లను శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గురుకులల్లో వసతి గృహల్లో స్టాఫ్ నర్సులు, ఎన్ఎన్ఎంలు ఉన్న సరైన మందులు అందుబాటులో లేవు. వైద్య సిబ్బంది కూడా రాత్రివేళ అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ లేక..

ప్రతిరోజు వసతి గృహాలను పర్యవేక్షించాల్సిన వార్డెన్లు పట్టించుకోవడం లేదు. రెంజల్ మండలంలోని ఓ అధికారి నెలలో ఒకరోజు మాత్రమే వసతి గృహానికి వెళ్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మహిళా వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఓ వార్డెన్ వారానికి ఒకసారి మాత్రమే హాస్టల్‌కు వెళ్తారని, సీసీ కెమెరాల్లో చూస్తూ ఇంటి నుంచే ఆదేశాలు జారీ చేస్తారని సమాచారం. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ఎస్సీ గురుకులాలు	11	6,320
బీసీ గురుకులాలు	13	7,760
ఎస్టీ గురుకులాలు	05	2,100
ఆదర్శ పాఠశాలలు	09	1,110
మైనారిటీ బడులు	17	8,352
కేజీబీవీలు	25	6,180

సంక్షేమ హాస్టళ్లలో..

ఎస్సీ	42	3,556
బీసీ	33	2,800
ఎస్టీ	08	1,480



జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో గల ఎస్సీ బాలికల వసతి గృహం

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇటీవల కురిసిన వర్షాలతో వ్యాధులు వ్యాపించి పలువురు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వారికి కూడా వైద్యం అందుబాటులో ఉంచుతున్నాం.
– కిషన్, ఎస్సీ గురుకులాల కో ఆర్డినేటర్, నిజామాబాద్

పర్యవేక్షణ చేస్తున్నాం

జిల్లాలో ఎస్సీ వసతి గృహాలను తనిఖీ చేస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వార్డెన్లు వసతి గృహాల్లో అందుబాటులో ఉండాలి. పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాం. విద్యార్థులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.
– నిర్మల, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల జిల్లా అధికారి

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎదురుగా, హైదరాబాద్ రోడ్, నిజామాబాద్
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
భుజం మరియు మోకాళ్ళకు కీ హోల్ సర్జరీ, కంప్యూటర్ నేవిగేషన్ పద్ధతి ద్వారా భుజం మరియు మోకాళ్ళ మార్పిడి, మోకాళ్ళ లిగ్మెంట్ గాయాలు, భుజం గూడు తప్పుట & కండరం చిరుగు, మృదులాస్థి (కార్టిలేజ్) సర్జరీ, స్టెంసెల్ చికిత్స	[illegible]	18-09-2024 3వ బుధవారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమో డయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు	[illegible]	
జీర్ణకోశ, పిత్తాశయం, అబ్డామినల్ క్యాన్సర్ మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధుల	[illegible]	19-09-2024 3వ గురువారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
మానని పుండ్లు, రొమ్ములో కణతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్	[illegible]	
అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	[illegible]	20-09-2024 3వ శుక్రవారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
మెదడులో గడ్డలు, రక్త స్రావం, చీము గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్ మరియు ఫిట్స్ వ్యాధులకు, డిస్క్ సమస్యలు, వెన్నుపాము గడ్డలు, ఫ్రాక్చర్ మరియు కీహోల్ న్యూరో శస్త్రచికిత్సలు	[illegible]	
అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	[illegible]	
నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, నరం ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్మెంట్స్), పార్శ్వగూని చికిత్స, వెన్నెముక ఇన్ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	[illegible]	

అపాయింట్‌మెంట్ కొరకు: 707 570 9496 | 709 368 3939

క్లుప్తంగా

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



ఆర్మూర్‌టౌన్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక వైపు హరితహారం, వనమహోత్సవాల పేరుతో యజ్ఞంలా మొక్కలు నాటుతుంటే బాధ్యత గల ప్రభుత్వ అధికారులే పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. పచ్చదనంతో కళకళలాడే పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో అనుమతులు లేకుండా ఏళ్లతరబడి కాపాడుతున్న చెట్లను నెలకూర్చారు. కనీసం ఫారెస్టు అధికారుల అనుమతి తీసుకోకుండా చెట్లను నరికివేయించారు. ఇదిలా ఉండగా కోతుల బెడదతో చెట్లను తొలగించినట్లు సమాచారం. కాగా విద్యార్థులకు నీడనిచ్చే చెట్లను ఎలాంటి అనుమతి లేకుండా తొలగించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు, చెట్లను సంరక్షించే బాధ్యత గల అధికారులే ఇలాంటి చర్యలకు పాల్పడటం గమనార్హం. అనుమతి లేకుండా చెట్లను నరికివేయించిన సదరు ప్రిన్సిపాల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల కవాతు



మోర్తాడ్‌: మోర్తాడ్‌లో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించనుండటంతో శాంతియుత వాతావరణం కలిగేలా కవాతును నిర్వహించారు. అందరు సోదరభావంతో మెదలుతూ వినాయక విగ్రహాల నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై విక్రమ్‌ బోయినపల్లి సూచించారు. ప్రజల సహకారంతోనే వివాదాలు లేకుండా సానుకూలమైన పరిస్థితులు నెలకొంటాయని ఆయన అన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాలలో ఆదివారం ఇంజినీర్స్‌ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్‌ కమిషనర్‌ మకరందు మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన ఇంజినీరింగ్‌ శైలితో ఎన్నో మంచి నిర్మాణాలు ఆవిష్కరణగా ఏర్పడ్డాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్‌ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల టాపర్లకు గోల్డ్‌ మెడల్‌ ప్రదానం చేశారు. బిగాల కృష్ణమూర్తి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో టాపర్లకు రూ. పదివేల చొప్పున ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ నరేశ్‌, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి తోట రాజశేఖర్‌, డీసీసీబీ చైర్మన్‌ రమేశ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘ ప్రతినిధుల హర్షం

నిజామాబాద్‌ నాగారం: జిల్లాకు చెందిన గౌడ కులస్తులకు ఉన్నత పదవులు లభించడంపై గౌడ సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బొమ్మ మహేశ్‌కుమార్‌ గౌడ్‌ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా, అలాగే ఇండియన్‌ ఓవర్సీస్‌ సౌత్‌ వెస్ట్‌ రీజియన్‌(అమెరికా) కాంగ్రెస్‌ వర్కింగ్‌ కమిటీ జనరల్‌ సెక్రటరీ యెర్ర అజయ్‌గౌడ్‌ ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ అధిష్టానానికి నగర పట్టణ గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎర్ర అజయ్‌గౌడ్‌, నాయకులు, శ్రీనివాస్‌గౌడ్‌, గోవర్దన్‌ గౌడ్‌, రత్నకర్‌గౌడ్‌, ప్రవీణ్‌గౌడ్‌, కిషన్‌గౌడ్‌, సాయికిరణ్‌గౌడ్‌, బోనాల నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్‌, స్వామిగౌడ్‌, నరేష్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌ వారికి అభినందనలు తెలిపారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాన్సువాడ: బీర్కూర్‌ మండల కేంద్రంలోని ప్రగతి విద్యానికేతన్‌లో 1999–2000కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి స్నేహితులు ఒకే చోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల విఠల్‌, వెంకటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వలసదారుల ఆశలు తీరేలా..

- గల్ఫ్‌ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం సుముఖత..!
- తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ ప్రకటనతో స్పష్టీకరణ
- ప్రజాపాలన దినోత్సవం రోజున ఏర్పాటయ్యే అవకాశం



గల్ఫ్‌ బోర్డు ఏర్పాటుపై చర్చిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, గల్ఫ్‌ జేఏసీ నాయకులు(ఫైల్‌)

మోర్తాడ్‌: గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ వలస కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన చేయడంతో మరింత బలం చేకూరుతోంది. దశాబ్దాల తరబడి నిరాదరణకు గురవుతున్న వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వెలువడుతున్న ప్రకటనతో ఉపశమనం కలిగే పరిస్థితి కనిపిస్తోంది. 2023లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ తన మ్యానిఫెస్టోలో గల్ఫ్‌ బోర్డు, ప్రవాసీ విధానం అమలుపై హామీ ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆయన మంత్రివర్గ సభ్యులు అనేక మార్లు గల్ఫ్‌ బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేశారు. కార్యాచరణ మాత్రం మొదలు కాకపోవడంతో ఓ దశలో వలస కార్మికులు నిరాశ చెందారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రోజున గల్ఫ్‌ బోర్డు ఏర్పాటు ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. బోర్డు అంశంపై శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ కన్వీనర్‌గా అత్యవసర సమావేశం నిర్వహించారు. గల్ఫ్‌ ప్రభావిత ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, టీపీసీసీ నేతలు, ఎన్‌ఆర్‌ఐ సెల్‌ నాయకులు, జేఏసీ ప్రతినిధుల బృందం సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో నాలుగు కీలక అంశాలపై ప్రధానంగా చర్చ సాగింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్‌ దేశాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడం ప్రధానమైనది. రాష్ట్ర రాజధానిలోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో గల్ఫ్‌, ఇతర దేశాల ప్రవాసుల కోసం ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో గల్ఫ్‌ కార్మికుల పిల్లలకు ప్రత్యేక అడ్మిషన్లు కల్పించడం, రైతు బీమా తరహాలో వలస వెళ్లే కార్మికులకు రూ.10లక్షల పాలసీని రూపొందించడంపై ప్రస్తావించారు. గల్ఫ్‌ వలస కార్మికుల సంక్షేమంపై అధ్యాయనం చేయడానికి ఓ సలహా కమిటీని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రముఖులు వీరే..

నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట్‌ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌ కుమార్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గల్ఫ్‌ బోర్డు ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమైందని ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రోజున బోర్డు ఆవిర్భావానికి చర్యలు తీసుకోవాలని వలసదారులు కోరుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

- పంచాయతీల ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్న నేపథ్యంలో..
- వచ్చే ఎన్నికల్లో పంచాయతీ రిజర్వేషన్‌ ఎలా ఉండబోతుందో అనే చర్చ

మోర్తాడ్‌: రాబోయే ఎన్నికల్లో ఏ పంచాయతీ స్థానం ఏ సామాజిక వర్గానికి రిజర్వు చేస్తారో అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఒకసారి రిజర్వు చేసిన స్థానంలో అదే విధానం రెండు టర్మ్‌లకు వర్తించేలా గత ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తాజాగా పంచాయతీలతో పాటు వార్డు స్థానాల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో ఖచ్చితంగా మార్పు ఉండబోతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌ పార్థసారథి ఇటీవల సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు మారుతాయని స్పష్టం చేశారు. జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలతో కలుపుకొని మొత్తం 545 ఉన్నాయి. వీటిలో వార్డుల సంఖ్య 5,020 వరకు ఉన్నాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఈ లెక్కన 273 పంచాయతీల సర్పంచ్‌ పదవులతో పాటు 2,510 వార్డు స్థానాలు మహిళలకు రిజర్వు చేయనున్నారు. అన్ని పంచాయతీలు, వార్డు స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌ చేస్తారు. గతంలో బీసీలకు కేటాయించిన స్థానం ఈసారి అలా ఉండే అవకాశం లేదు. బీసీ కమిషన్‌ ఇచ్చే నివేదిక ఆధారంగా పంచాయతీల్లో వారి స్థానాల సంఖ్య పెంచుతారా అనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం ఓటర్ల జాబితాను పూర్తి చేసే పనిలో పంచాయతీ సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. రిజర్వేషన్లు మారితే తమకు పోటీ చేసే అవకాశం వస్తుందనే ఉద్దేశంతో ఎంతో మంది ఆశావహులు ఆసక్తితో ఉన్నారు. మరి కొందరు గతంలో ఓటమిపాలైనవారు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశతో ఉన్నారు.

రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

పంచాయతీ సర్పంచ్‌, వార్డు స్థానాల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు పాతవి కొనసాగుతాయా లేక మార్పులు చేయాల్సి ఉంటుందా అనే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పంచాయతీలు, వార్డు స్థానాలు పెరగడంతో రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది.

– తరుణ్‌కుమార్‌, జిల్లా పంచాయతీ అధికారి

ఉద్యమ నాయకుడికి ఘన నివాళి



హైదరాబాద్‌లో మనోహర్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న అన్వేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డి

- రైతు నాయకుడు మనోహర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

ఆర్మూర్‌: పసుపు బోర్డు, ఎర్రజొన్నల బకాయిల కోసం జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్న రైతు నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి అంత్యక్రియలు హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఆదివారం నిర్వహించారు. మోర్తాడ్‌ మండలం పాలెం మాజీ సర్పంచ్‌ అయిన మనోహన్‌రెడ్డి ఆర్మూర్‌లో నివాసం ఉంటూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించడానికి జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. పసుపు బోర్డు సాధించే వరకు కాళ్లకు చెప్పులు కూడా వేసుకోకుండా సుమారు 12 ఏళ్ల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరసన తెలిపారు. కాలి నడకన తిరుపతి వరకు వెళ్లి పసుపు రైతుల గోసకు గుర్తింపు వచ్చేలా చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ అన్వేష్‌రెడ్డి, ఆర్మూర్‌ డివిజన్‌ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు వి ప్రభాకర్‌, దేగాం యాదాగౌడ్‌, మంథని గంగారాం, లింగారెడ్డి, దేవరాం, నిజామాబాద్‌, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతు నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి ఆయన పార్థివ దేహానికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పోరాటయోధుడు మనోహర్‌రెడ్డి

వేల్పూర్‌: పసుపుబోర్డు సాధన నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి అలుపెరుగని పోరాట యోధుడని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మనోహర్‌రెడ్డి మృతదేహానికి బాల్కొండ, ఆర్మూర్‌ నియోజవర్గాల కాంగ్రెస్‌ ఇన్‌చార్జులు ముత్యాల సునీల్‌కుమార్‌, వినయ్‌రెడ్డితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ పసుపుబోర్డు వచ్చేంత వరకు పాదరక్షలు లేకుండా పాదయాత్ర చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కాగితాలకే పరిమితమైన పసుపుబోర్డు నిర్మాణం జరిగినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు.

గిజిగాడి గూడు..



ఈ ప్రకృతి సోయగాన్ని, పక్షుల పనితనాన్ని చూస్తుంటే ఎవరికైనా ముచ్చట వేయక మానదు. పాముల నుంచి తమ పిల్లలను కాపాడుకోవడానికి పక్షులు చిటారు కొమ్మల్లో కట్టుకున్న గూళ్లు ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో సాక్షి కెమెరాకు చిక్కాయి. ఈత చెట్టు మొత్తం పక్షులు గూళ్లు కట్టుకున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటోంది.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌-నిజామాబాద్‌

బేస్‌బాల్‌ చాంపియన్‌గా నిజామాబాద్‌



నిజామాబాద్‌ బాలికల జట్టుకు కప్పు అందజేస్తున్న నిర్మల్‌ మున్సిపల్‌ చైర్మన్‌ ఈశ్వర్‌

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ మినీ స్టేడియంలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్‌–21 జూనియర్స్‌ బాలబాలికల బేస్‌బాల్‌ పోటీలు ఆదివారం ముగిశాయి. బేస్‌బాల్‌ అసోసియేషన్‌ నిర్మల్‌ జిల్లా అధ్యక్షుడు పుంద్రు సుధాకర్‌ రెడ్డి, కార్యదర్శి గంగాధర్‌ నేతృత్వంలో నిర్వహించిన పోటీల్లో 22 జిల్లాల నుంచి మొత్తం 22 జట్లు, 980 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన బాలుర సెమీఫైనల్‌ పోటీల్లో హైదరాబాద్‌, నిజామాబాద్‌ జట్లు తలపడగా హైదరాబాద్‌ జట్టు 05–02తో విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో రంగారెడ్డి, వరంగల్‌ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు 04–02తో విజయం సాధించింది. ఫైనల్‌లో రంగారెడ్డి, హైదరాబాద్‌ జట్లు తలపడగా హైదరాబాద్‌ 05–01తో కప్పు సాధించింది. బాలికల మొదటి సెమీఫైనల్‌లో రంగారెడ్డి, నల్గొండ తలపడగా 06–04తో నల్గొండ జట్టు విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో నిజామాబాద్‌ జట్టుతో మహబూబాబాద్‌ జట్టు తలపడగా 10–0 తో నిజామాబాద్‌ జట్టు విజయం సాధించింది. ఫైనల్‌లో నిజామాబాద్‌, నల్గొండ జట్లు తలపడగా నిజామాబాద్‌ జట్టు కప్పు కైవసం చేసుకుంది. విజేతలకు నిర్మల్‌ మున్సిపల్‌ చైర్మన్‌ గండ్రత్‌ ఈశ్వర్‌ కప్పు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్‌ జమున, పీటీ భూమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఐఎస్‌ కార్యక్రమాలపై అవగాహన ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఐఎస్‌ ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్‌) కార్యక్రమాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్‌ అన్నారు. నగరంలోని ఇందూర్‌ కన్స్యూమర్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆదివారం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం–2019 ప్రకారం వినియోగదారులకు కల్పించిన హక్కులను కాపాడడానికి వినియోగదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారతీయ ప్రమాణాల సంస్థ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ముఖ్యంగా బీఐఎస్‌ రూపొందించిన యాప్‌ను ప్రతి వినియోగదారుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వివిధ రకాల వస్తువులు, సరుకుల నాణ్యత ధ్రువీకరణకు 380 ఉత్పత్తులకు బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌ సర్టిఫికేషన్‌ తప్పనిసరి చేసిందని డాక్టర్‌ పల్లెపాడు దామోదర్‌ తెలిపారు. 380 రకాల ఉత్పత్తులలో చిన్న పిల్లలకు ముఖ్య ఆహారమైన పాలపొడి, కొన్ని రకాల వంటనూనెలు, వనస్పతి, త్రాగు నీరు, బంగారు ఆభరణాలు, సిమెంట్‌ లాంటివి ఉన్నాయన్నారు. అనంతరం బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌ ప్రాధాన్యత తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్‌ కుమార్‌, ఉపాధ్యక్షుడు వియస్‌ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్‌, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్‌, గైని రత్నాకర్‌, గడప రవికుమార్‌, బానోత్‌ సందీప్‌ పాల్గొన్నారు.

గణపతి లడ్డూకు భారీ ధర



కాలూర్‌లో లడ్డూను దక్కించుకున్న అన్వేష్‌



జెండాగల్లీలో లడ్డూను దక్కించుకున్న నర్సారెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని ఆయా గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు ఆదివారం నిమజ్జనానికి తరలినాడు. ఈ నేపథ్యంలో మండలంలోని కాలూర్‌లో ఆదివారం అదే గ్రామానికి చెందిన సుక్కబోట్ల అన్వేష్‌ శ్రీ భవాని పుత్ర గణేశ్‌ మండపంలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.లక్ష46వేలకు దక్కించుకున్నారు. అలాగే కాలూరుకు చెందిన జెండాగల్లీ మండపానికి చెందిన యెన్నం నర్సరెడ్డి రూ.లక్ష11 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు.

సాయం సంధ్యలో ప్రకృతి సోయగం



మద్నూర్‌లో నీలం రంగులో ఆకాశం, చెరువు

మద్నూర్‌ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం నీలం రంగులో కనిపించింది. అలాగే చెరువు గట్టుపై ఉన్న చెట్ల ప్రతిబింబం చెరువు నీటితో కనబడుతున్న ఈ దృశ్యాలు చూపరులను కట్టిపడేశాయి.

– మద్నూర్‌(జుక్కల్‌)



మద్నూర్‌లోని పెద్ద చెరువులో నీటిలో చెట్టు ప్రతిబింబం



మద్నూర్‌లో సూర్యాస్తమయ సమయంలో కనువిందు చేస్తున్న దృశ్యం

క్రైం కార్నర్‌

ఇసుక లారీలు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

బిచ్కుంద: మండలంలోని ఫత్లాపూర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలు, టిప్పర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పొతంగల్‌ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఒక లారీని ఎస్సై మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. ప్రతి రోజు షెట్లూర్‌, సుల్తాన్‌పేట్‌, పొతంగల్‌, ఎస్‌బూర గ్రామాల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. పొతంగల్‌ నుంచి షెట్లూర్‌ మీదుగా టిప్పర్లు వస్తున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు ఫత్లాపూర్‌ వద్ద పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక వాహనాల పట్టివేత

మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను సంబంధిత అధికారులు పట్టుకున్నారు. మండలంలోని లచ్చన్‌గేట్‌ వద్ద ఆదివారం అక్రమంగా కర్ణాటకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను ఎస్సై విజయ్‌కొండ పట్టుకున్నారు. కర్ణాటకలోని ఔరాద్‌కు చెందిన టిప్పర్‌ యజమాని నరేశ్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే మండలంలోని రూసేగావ్‌ గేట్‌ వద్ద అక్రమంగా తరలుతున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు తహసీల్దార్‌ ముజీబ్‌ తెలిపారు. అధికారులు ఇసుక లారీని పట్టుకోవడంతో డ్రైవర్‌ పరారైనట్లు తహసీల్దార్‌ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న కామారెడ్డి జిల్లా బీర్కూర్‌ మండలం మిర్జాపూర్‌కు చెందిన కత్రి విఠల్‌ సింగ్‌(50) నిర్మల్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. విఠల్‌ సింగ్‌ తాగుడికి బానిసై నిత్యం కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈ నెల 10న ఇంట్లో గొడవ జరగగా 11న ఉదయం ఇంట్లో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ఖలీల్‌వాడి/ ధర్పల్లి: నగరంలోని నాలుగో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని ఫులాంగ్‌ వద్ద శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. పేకాట స్థావరంపై దాడి చేయగా నలుగురి నుంచి రూ.15,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ధర్పల్లి మండలంలోని రామడుగు శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.17 వేల నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గండివేట్‌లో..

గాంధారి: మండల పరిధిలోని గండివేట్‌లో గణేశ్‌ మండపాలను పేకాట స్థావరాలుగా మార్చి పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడులు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరాలపై దాడులు చేశామని వీరి నుంచి రూ. 29,460 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముప్కాల్‌లో ఉద్రిక్తత

- శివాజీ విగ్రహ ఏర్పాటులో వివాదం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలో శివాజీ విగ్రహ ఏర్పాటులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానిక మార్కెట్‌ యార్డ్‌ పక్కన విగ్రహ ఏర్పాటుకు రెండు రోజుల క్రితం గ్రామస్తులు భూమి పూజ చేశారు. కానీ విగ్రహ ఏర్పాటుపై ఓ సామాజిక వర్గం వారు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం తలెత్తింది. దీంతో ఆదివారం ఉదయం గ్రామంలో ఇంటికొకరు చొప్పున తరలివచ్చి పాత జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామంటు గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో కొద్ది సమయం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి, రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడి నచ్చజెప్పారు. విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. దీంతో గ్రామస్తులు వెంటనే విగ్రహ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల షాపులో చోరీ



రుద్రూర్‌: మండల కేంద్రంలోని బస్టాండ్‌ సమీపంలో ఉన్న కూరగాయాలు విక్రయించే షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు షాపు తాళం పగలగొట్టి చిల్లర నగదు, కొన్ని కూరగాయలను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు కళావతి తెలిపారు. గతంలో కూడా దుండగులు చోరీకి పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని కూరగాయల షాపుతో పాటు ఎదురుగా ఉన్న పాన్‌ షాపులో దుండగులు చోరీకి పాల్పడ్డారని, పోలీసులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి చోరీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

